


సమగ్ర విద్యకు కేరాఫ్ గురుకుల సీవోఈ 8లో



రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు 8లో



విజయకేతనం



విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు



కూటమికి బెత్తం దెబ్బ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి టీచర్లు ఝలక్

పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడికే అయ్యవార్లు పట్టం

వర్మ ఓట్ల లెక్కింపుతో గాదెకు 12,035 ఓట్లు వచ్చినట్లుగా ప్రకటన

మొత్తం పోలైన ఓట్లు	20,791
చెల్లిన ఓట్లు	20,135
చెల్లని ఓట్లు	656
మ్యాజిక్ ఫిగర్	10,068
గాదె శ్రీనివాసులునాయుడుకి వచ్చిన ఓట్లు	12,035
మెజారిటీ	1967



సోమవారం రాత్రి ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ రహదారిపై ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు



కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న పోలింగ్ సిబ్బంది

నాటకీయ పరిణామాలతో ఉద్రిక్తత

గాదె విజయం 9 గంటలకు ఖరారైంది. ఆర్వో కూడా సంతకం చేసి వెళ్లిపోయినా అధికారికంగా ప్రకటించకపోవడం, ధృవీకరణ పత్రం జారీ చేయకపోవడంతో కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లు పీఆర్‌టీయూ ప్రతినిధులు గ్రహించారు. టీడీపీ నాయకులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ రాత్రి 9.30 గంటల సమయంలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉపాధ్యాయుల్లో మరింత అనుమానాలు రేకెత్తాయి. గెలువు విషయంలో ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతుందేమోనని గ్రహించారు. వెంటనే అధికారికంగా ప్రకటించి.. ధృవీకరణ పత్రం జారీ చెయ్యాలంటూ పట్టుబట్టారు. కానీ.. కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గాదె మద్దతుదారులు ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మెయిన్ ఎంట్రన్స్ రహదారిపై ధర్నాకు దిగారు. వెంటనే ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేయాలంటూ నినదించారు. ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపడుతున్నారని గ్రహించిన టీడీపీ నేతలు అక్కడి నుంచి జారుకున్నారు. చివరికి పోలీసులు కౌంటింగ్ కేంద్రంలో ఉన్న గాదె శ్రీనివాసులు నాయుడు మద్దతుదారులతో ఫోన్‌లో మాట్లాడి.. ఇక్కడ అంతా సవ్యంగానే ఉందని చెప్పడంతో నిరసన ఉపసంహరించుకున్నారు.



ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు		9వ రౌండ్ చివరి ఎలిమినేషన్‌లో భాగంగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	
అభ్యర్థి	వచ్చిన ఓట్లు	వచ్చిన ఓట్లు	ఎలిమినేషన్
కె.విజయ గౌరి	5,804	-	8
డాక్టర్ కె.రాధాకృష్ణ	30	-	3
గాదె శ్రీనివాసులు నాయుడు	7,210	9,237	
దుర్గారావు	67	-	6
ఎన్.సూర్య ప్రకాష్	85	-	7
ఎస్.ఎస్.పద్మావతి	15	-	2
పి.రఘువర్మ	6,845	8,527	
పి.శివప్రసాద్ రావు	15	-	1
ఆర్.సత్యనారాయణ	31	-	4
డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు	33	-	5
మొత్తం	20,135	ఎలిమినేషన్స్ ఓట్లు 2,371	

- కూటమి ప్రభుత్వం మద్దతిచ్చిన పాకలపాటి రఘువర్మకు షాక్
- టీడీపీ, జనసేన నేతలు కాళ్లకు బలపాలు కట్టుకొని తిరిగినా పట్టించుకోని ఉపాధ్యాయులు
- ఫలించని ప్రజాప్రతినిధుల ప్రలోభాల ఎర
- తొమ్మిది నెలల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం ఈ ఫలితం



ఆంధ్రా యూనివర్సిటీ దగ్గర ఉపాధ్యాయ సంఘాల నాయకుల విజయానందం

సాక్షి, విశాఖపట్నం/విశాఖ సిటీ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి షాకిచ్చాయి. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే కూటమి పార్టీలకు ఉపాధ్యాయులు బెత్తం దెబ్బ రుచి చూపించారు. పాకలపాటి రఘువర్మను గెలిపించేందుకు టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు కాళ్లకు బలపాలు కట్టుకొని ఉత్తరాంధ్ర జిల్లాల్లో కలియతిరిగినా టీచర్లు కనికరించలేదు. ఓటుకు రూ.2 వేలు నుంచి రూ.10 వేలు వరకు ఇచ్చి ప్రలోభాల ఎర వేసినా లొంగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకే పట్టం కట్టారు. ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టులా పరిణమించాయి.

ప్రలోభాల ఎర వేసినా.. ఏజెంట్ల అవతారమెత్తినా..

పాకలపాటి రఘువర్మ విజయానికి కూటమి నేతలు ఎన్ని ప్రలోభాల ఎర వేసినా.. ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు ఎలక్షన్ ఏజెంట్ల అవతారమెత్తినా ఉపాధ్యాయులు కనికరించలేదు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా జరుగుతాయి. ఇటువంటి గౌరవప్రదమైన ఎన్నికలకు కూటమి ప్రభుత్వం రాజకీయ రంగు పులిమింది. ఏపీటీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మకు ముందు టీడీపీ, జనసేనలు మద్దతుగా నిలిచాయి. నామినేషన్ వేసిన దగ్గర నుంచి పోలింగ్ వరకు ఆ పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రఘువర్మ విజయం నల్లేరుపై నడకే అన్న తరహాలో ప్రచారం చేసుకుంటూ పోయారు. మరోవైపు కూటమి ప్రభుత్వం మద్దతు ఉన్న రఘువర్మను గెలిపిస్తేనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం కల్పించారు. ఉత్తరాంధ్రలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వేర్వేరుగా ప్రత్యేక పార్టీలు, విందులు, వినోదాలు ఏర్పాటు చేశారు. ఓటుకు రూ.2 వేలు నుంచి రూ.10 వేలు వరకు ముట్టజెప్పారు. పోలింగ్ రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేంద్రాల వద్ద టెంట్లలో ఎన్నికల ఏజెంట్ల తరహాల్లో ఓటర్ స్లిప్పులను సైతం అందించారు. ఇలా ఎన్ని చేసినా ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకోలేదు.

తొమ్మిది నెలలకే ప్రభుత్వంపై వ్యతిరేకత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం, రాష్ట్ర ఖజానాను నింపుకోవడం కోసం విద్యుత్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వంపై అనతికాలంలోనే అన్ని వర్గాలకు ఆశలు సన్నగిల్లాయి. ప్రధానంగా ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ఇప్పటివరకు దృష్టి పెట్టకపోవడంతో పాటు పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ వంటి వాటి ప్రస్తావనే చేయకపోవడంపై కూడా ఉద్యోగ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. ఈ క్రమంలో జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్లు ప్రభుత్వానికి తమ దెబ్బ రుచి చూపించారు. టీడీపీ, జనసేన మద్దతిచ్చిన పాకలపాటి రఘువర్మను ఓడించి గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఇంతటి వ్యతిరేకతను మూటగట్టుకోవడంతో కూటమి శ్రేణులు డీలా పడ్డాయి. ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు రంగంలోకి దిగినప్పటికీ ఓటమి చవిచూడడంతో జీర్ణించుకోలేకపోతున్నాయి.

ఈవీఎం కాదు.. బ్యాలెట్ విజయమిది.!

గాదె విజయానంతరం పీఆర్టీయూ మద్దతుదారులతో కౌంటింగ్ కేంద్రం వద్ద కోలాహలం ఏర్పడింది. ఇది ఈవీఎం విజయం కాదనీ... బ్యాలెట్ బాక్సుల విజయమని కొందరు ఉపాధ్యాయులు వ్యాఖ్యానించడం గమనార్హం.

తొలి నుంచి గాదెకు ఆధిక్యం



గాదెకు స్వీటు తినిపిస్తున్న ఉపాధ్యాయురాలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. ఉదయం 11.30 గంటలకు బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను 20 టేబుల్స్‌కు సరిపడేలా కట్టలు కట్టారు. మొత్తం 20,971 ఓట్లు పోలవ్వగా 656 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. దీంతో 10,068 ఓట్లను మ్యాజిక్ ఫిగర్‌గా ప్రకటించారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఆది నుంచీ గాదె శ్రీనివాసులనాయుడు ఆధిక్యంలో కొనసాగారు. మొదటి ప్రాధ్యానత ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి గాదె 365 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. గాదెకు మొదటి ప్రాధ్యాన్యత ఓట్లు 7,210 రాగా, రఘువర్మకి 6,845 ఓట్లు, విజయ గౌరికి 5,804 ఓట్లు వచ్చాయి. మధ్యాహ్నం విరామం అనంతరం ఎలిమినేషన్ రౌండ్ల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు కొనసాగింది. ప్రతి దశలోనూ గాదె ఆధిక్యం కొనసాగింది. మూడో స్థానంలో ఉన్న విజయ గౌరికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత లెక్కింపు చేపట్టారు. 9వ రౌండ్‌లో గాదె 9,237 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా.. వర్మకు 8,527 ఓట్లు వచ్చాయి. దీంతో తన ఓటమి ఖరారైందని భావించిన వర్మ కౌంటింగ్ కేంద్రం నుంచి నిరాశగా వెనుదిరిగారు. అయితే.. మ్యాజిక్ ఫిగర్ ఓట్లు సాధించేందుకు గాదె ఇంకా 831 ఓట్ల దూరంలో నిలిచారు.

1967 ఓట్ల మెజారిటీతో విజయం

అప్పటికే వర్మ బయటికి వెళ్లిపోవడంతో వర్మకి చెందిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లని లెక్కించాలా.. గాదె విజయాన్ని ధృవీకరించాలా అనే అంశంపై రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిరప్రసాద్, ఎన్నికల అబ్జర్వర్ ఎం.ఎం.నాయక్ ఎలక్షన్ కమిషన్‌కి అభ్యర్థించారు. మ్యాజిక్ ఫిగర్ వచ్చేంతవరకూ లెక్కించాలని చెప్పడంతో వర్మకి వచ్చిన ఓట్ల లెక్కింపును సాయంత్రం 6.45 గంటలకు ప్రారంభించారు. గాదె మ్యాజిక్ ఫిగర్ 10,068 ఓట్లకు చేరుకోగానే అధికారికంగా గాదె విజయం సాధించారు. మిగిలిన ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేశారు. చివరకు గాదెకు 12,035 ఓట్లు వచ్చాయి. రిటర్నింగ్ అధికారి గాదె విజయం సాధించినట్లు సంతకం చేసి ఎన్నికల కమిషన్ సంతకం కోసం విజయవాడ పంపించారు.

నెగిటివ్ ఉండడం వల్లే ఓడిపోయాను..

పాకలపాటి రఘువర్మ, కూటమి బలపర్చిన అభ్యర్థి



ఓటమి భారంతో వెనుదిరుగుతున్న టీడీపీ, జనసేన మద్దతు అభ్యర్థి రఘువర్మ

ఆరేళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశాను. అయినా ఓడిపోయాను. గత ఎన్నికల్లో యూటీఎఫ్‌తో కలిసి బరిలో దిగి విజయం సాధించాను. ఈసారి విడివిడిగా పోటీ చేయడం కూడా ఓటమికి ఒక కారణం. టీడీపీ, జనసేన వారం ముందు మాత్రమే మద్దతు ప్రకటించాయి. ఉపాధ్యాయుల్లో నెగిటివ్ ఉంది. ఆ నెగిటివ్ నామీద కాదు. ఓటమిని అంగీకరిస్తున్నాను. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తాను.

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు



ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నాటి పరీక్షకు మొత్తం 38,478 మంది నమోదు చేసుకోగా, వీరిలో 401 మంది గైర్హాజరయ్యారు. 99 శాతం హాజరు నమోదైనట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కేంద్రాలను ప్రత్యేక తనిఖీ బృందాలు పరిశీలించాయి. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జైల్‌రోడ్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న గదుల్లోకి వెళ్లి, నిర్వహణను స్వయంగా చూశారు. విద్యార్థులకు ఎలాంటి ఏర్పాట్లు చేశారనేది నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని కొంతమంది విద్యార్థులనూ అడిగి తెలుసుకున్నారు.

ఇలాగేనా.. గ్రాండ్ టెస్ట్

- పరీక్షకు డుమ్మా కొడుతున్న విద్యార్థులు
- బీఈడీ విద్యార్థులతో పరీక్షలపై పర్యవేక్షణ



పరీక్ష కేంద్రంలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న బీఈడీ విద్యార్థిని

విశాఖ విద్య: విద్యాశాఖ ఆదేశాల మేరకు టెన్త్ విద్యార్థుల్ని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో గ్రాండ్ టెస్టులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 వరకు వార్షిక పరీక్షల మాదిరే పకడ్బందీగా వీటిని నిర్వహించేలా షెడ్యూల్ ఇచ్చారు. అయితే గ్రాండ్ టెస్టులకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. నగరంలోని ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్(ఎయిడెడ్)లో టెన్త్ విద్యార్థులు 82 మందికి గాను 64 మంది గ్రాండ్ టెస్ట్ రాశారు. విద్యార్థులు ఇళ్ల వద్ద, మరికొంతమంది కోచింగ్‌లకు వెళ్తున్నందున గ్రాండ్ టెస్ట్‌కు గైర్హాజరైనట్లు పాఠశాల హెచ్‌ఎం సలోమి తెలిపారు. ఇక్కడి పరీక్షను బీఈడీ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పర్యవేక్షణ చేయించారు. మూడు గదుల్లో పరీక్షలు నిర్వహించగా, అన్ని చోట్ల బీఈడీ చేస్తున్న విద్యార్థులే ఇద్దరు ముగ్గురు చొప్పున పర్యవేక్షిస్తూ కనిపించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గ్రాండ్ టెస్టుల నిర్వహణ తీరుపై సందేహాలు ముసురుకున్నాయి.

హాజరు అంతంత మాత్రమే..

సమ్మెటివ్-1, సమ్మెటివ్-2 పరీక్షల ప్రాతిపదికగా, విద్యార్థులకు గ్రేడింగ్ ఇచ్చి, వారిని వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వీటికి తోడు అట్టహాసంగా గ్రాండ్ టెస్టులకు సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థులు గ్రాండ్ టెస్టులపై ఆసక్తి చూపటం లేదనేది ఏయూ హైస్కూల్ హాజరు తీరునుబట్టి తెలుస్తోంది. ఒక్క స్కూల్లోనే 18 మంది వరకు విద్యార్థులు గైర్హాజరైతే.. జిల్లా వ్యాప్తంగా ఇంకెంత మంది డుమ్మా కొడుతున్నారో..? తేలాల్సి ఉంది. గ్రాండ్ టెస్టుల నిర్వహణపై అధికారులకు, ఉపాధ్యాయులకు కూడా పెద్దగా ఆసక్తి లేదన్నది స్పష్టమవుతోంది.

కేకే లైన్‌లో ప్రయాణికుల రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కేకే లైన్ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 15 మధ్య దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్- విశాఖపట్నం (58502) పాసింజర్ స్పెషల్ ఈ నెల 8 నుంచి 16 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.
- విశాఖపట్నం-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7 నుంచి 15 మధ్య దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్- విశాఖపట్నం (18516) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8 నుంచి 16 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. ఈ తేదీల్లో దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

అధికారులే బలిపశువులు

- కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనతో రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దు
- ప్రపంచ స్థాయి ప్రమాణాల కల్పనకు నిధులివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- ఇందుకు అధికారులను బాధ్యులను చేస్తూ బదిలీల వేటు
- టూరిజం ఇన్‌చార్జి ఆర్డీ రమణ, డీటీవో జ్ఞానవేణిలకు స్థానచలనం



బ్లూ ఫ్లాగ్‌ను తొలగించిన దృశ్యం

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు అధికారులు బలిపశువులుగా మారారు. రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దు విషయంలో అధికారులనే దోషులుగా ప్రభుత్వం తేల్చింది. పర్యాటక శాఖ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్ రమణతో పాటు పర్యాటక శాఖాధికారిణి జ్ఞానవేణిలపై బదిలీ వేటు వేసింది. ఈ కీలక అధికారుల మధ్య సమన్వయ లోపమే ప్రపంచ స్థాయి గుర్తింపు రద్దవడానికి కారణమని తప్పును వారిపై నెట్టేసింది. రుషికొండకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు దిద్దుబాటు చర్యలు దిగినట్లు కలరింగ్ ఇస్తోంది.

విశాఖపై సవతి ప్రేమ

విశాఖపై కూటమి ప్రభుత్వానికున్న సవతి ప్రేమ ఈ ఉదంతంతో బట్టబయలైంది. గత ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తున్నట్లు ప్రకటించిన నాటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలు విశాఖపై విషం చిమ్ముతూనే ఉన్నాయి. విశాఖలో అభివృద్ధి, పర్యాటక ప్రాజెక్టులు, కీలక నిర్మాణాలకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేస్తూ వచ్చాయి. అయినప్పటికీ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా రుషికొండ బీచ్‌ను రూ.7.35 కోట్లతో అభివృద్ధి చేసింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించింది. దీంతో రుషికొండ బీచ్‌కు పర్యావరణ హిత, ప్రమాద రహిత బీచ్‌లకు అందించే బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ 2020, అక్టోబర్ 11న దక్కింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 13 బీచ్‌లు ఈ సర్టిఫికేషన్ కోసం పోటీపడగా రుషికొండ బీచ్ అందులో ఒకటిగా ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అప్పటి నుంచి వరుసగా నాలుగేళ్ల పాటు ఈ గుర్తింపును నిలబెట్టుకుంటూ వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో పర్యాటకం పూర్తిగా పడకేసింది. ఇక్కడి బీచ్‌లో సౌకర్యాలపై కనీసం దృష్టి సారించలేదు. పర్యాటక శాఖకు పైసా కూడా విదిల్చలేదు. దీంతో ఈ బీచ్ కళావిహీనంగా మారిపోయింది. ఫలితంగా బ్లూఫ్లాగ్ గుర్తింపును డెన్మార్క్ సంస్థ ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్(ఎఫ్ఈఈ) రద్దు చేసింది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం బూటకపు దిద్దుబాటు చర్యలకు దిగింది. ఈ పరిణామాలకు అధికారులనే బాధ్యులను చేసి వారిపై బదిలీ వేటు వేసింది.

ఇద్దరికి బదిలీ

ఇన్‌చార్జి ఆర్డీగా ఉన్న రమణను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. అతని స్థానంలో టూరిజం డివిజనల్ మేనేజర్‌గా ఉన్న వి.బి.జగదీష్ గేదెలను ప్రభుత్వం నియమించింది. అలాగే జిల్లా పర్యాటక శాఖ అధికారిగా ఉన్న జ్ఞానవేణిని మాతృశాఖకు పంపించింది. ఆమె స్థానంలో టూరిజం మేనేజర్‌గా ఉన్న జి.దాసుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో 'బ్లూఫ్రాడ్'

ప్రభుత్వ నిర్లక్ష్యం, చేసిన తప్పిదాలు కారణంగా 'బ్లూ ఫ్లాగ్'కాస్తా 'బ్లూ ఫ్రాడ్'గా మారిపోయింది. బీచ్ నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు కేంద్రం నుంచి వచ్చిన బ్లూఫ్లాగ్ నిధులను మాత్రం మింగేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతలతో చేతులు కలిపి ఈ నిధులను దోచుకున్నారన్న టాక్ ఉంది. ఫలితంగానే పర్యాటకులు సేదతీరేందుకు కూడా కనీస వసతులు లేకుండా పోయాయి. వాస్తవానికి బ్లూఫ్లాగ్ బీచ్‌కు నోడల్ అధికారిగా జిల్లా పర్యాటక శాఖ అధికారి జ్ఞానవేణి వ్యవహరించాలి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ అధికారాలన్నీ రీజినల్ డైరెక్టర్ చేతిలో పెట్టింది. గత ఆర్డీని బదిలీ చేసిన ప్రభుత్వం టూరిజం ఈఈగా ఉన్న రమణను ఇన్‌చార్జి ఆర్డీగా నియమించింది. దీని ప్రకారం ఆయనే రుషికొండ బీచ్‌లో సౌకర్యాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. అయితే వీరిద్దరి మధ్య సమన్వయలోపం కారణంగా ప్రతిష్టాత్మక బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దయిందని కూటమి ప్రభుత్వం వారిపై బదిలీ వేటు వేస్తూ.. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

విశాఖ విద్య : సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా తనిఖీలు చేపట్టినట్లు డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 968 మంది విద్యార్థులకు గానూ 864 మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు.

సమగ్ర విద్యకు కేరాఫ్
గురుకుల సీవోఈ

- 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 6వ తేదీ ఆఖరు
- ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష



ఏటీఎల్ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రయోగాలు

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(గురుకుల సీవోఈ) విద్యార్థులకు సమగ్ర విద్యను అందిస్తూ.. విశేష గుర్తింపు పొందింది. ఇక్కడ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్, జీవిత నైపుణ్యాలు, క్రమశిక్షణ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలపై విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. గురుకుల సీవోఈలో విద్యనభ్యసించిన విద్యార్థులు నీతి ఆయోగ్, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారు. అందుకే ఈ గురుకులంలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి గానూ ఇక్కడ 5వ తరగతి, ఇంటర్మీడియట్(ఇంగ్లిష్ మీడియం) కోర్సుల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తు విధానం

ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4.30 గంటల్లోపు ఆన్‌లైన్‌లో https://apbragcet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలివీ..

- 5వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24లో 3వ తరగతి, 2024–25లో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 01 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించకూడదు. గ్రామ/వార్డు సచివాలయం లేదా మండల రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. రిజర్వేషన్ ప్రకారం 80 సీట్లు భర్తీ చేస్తారు.

పరీక్ష తేదీ: ఏప్రిల్ 6, ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు..

- ఇంటర్మీడియట్ (ఎంపీసీ/బైపీసీ)లో చేరేందుకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ పద్ధతిలో చదివి, 2025 మార్చిలో జరిగే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. 2025 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు మించకూడదు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయం లేదా మండల రెవెన్యూ అధికారి ధ్రువీకరణపత్రం జతచేయాలి.

మొత్తం ఖాళీలు: 80 సీట్లు (ఎంపీసీ/బైపీసీ)

ఎస్సీ అభ్యర్థులకు 60 సీట్లు(ఎంపీసీ 30, బైపీసీ 30) ఎస్టీ: 05(ఎంపీసీ/ బైపీసీ), బీసీ: 04(ఎంపీసీ 2, బైపీసీ 2), ఓసీ: 01

పరీక్ష తేదీ: ఏప్రిల్ 6 ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు..

ప్రత్యేకతలివే..

- విద్యతో పాటు ఆటలు, కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జీవిత నైపుణ్యాలు, క్రమశిక్షణ, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై శిక్షణ.
- నీతి ఆయోగ్, ఇతర సంస్థలు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థుల విజయాలు..
- కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏటీఎల్ ద్వారా సైన్స్, ఇతర వైజ్ఞానిక ప్రయోగాలకు అవకాశం
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, ఉచిత వసతి, విద్య, పౌష్టికాహార భోజనం
- దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఇతర అవసరమైన వస్తువుల పంపిణీ
- ఐఐటీ, నీట్, జేఈఈ మెయిన్స్, ఈఏపీ సెట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ.



కొమ్మాది రిక్షా కాలనీలోని గురుకుల సీవోఈ

పరిపూర్ణ విద్యార్థిగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తూ, అన్ని రంగాల్లో రాణించే పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, తద్వారా ప్రతి విద్యార్థి సమగ్ర వికాసం సాధించేలా చూడడమే మా ప్రధాన లక్ష్యం

– డి.శాంతకుమారి, ప్రిన్సిపాల్, గురుకుల సీవోఈ

గాదె గెలుపుతో సంబరాలు

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడంతో ఆయనకు మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. గాదె గెలుపు ఖాయమని తేలడంతో సోమవారం సాయంత్రానికి ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ, బీటీఏ, ఏపీయూఎస్ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ క్రీడా మైదానానికి చేరుకున్నారు. అధికార కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా ఉపాధ్యాయులు తమ సత్తా చాటుకున్నారంటూ అంతా కేరింతలు కొట్టారు. గాదె శ్రీనివాసులు నాయడు గెలుపు ఉపాధ్యాయుల సమష్టి విజయమని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించగల నాయకుడుని ఎన్నుకోవటం ఆనందదాయకమని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఏపీయూఎస్ నాయకులు శ్రీనివాస్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గాదె గెలుపు చారిత్రాత్మకం

మురళీనగర్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపు చారిత్రాత్మకమని ఏపీటీఎఫ్ (1938) గౌరవాధ్యక్షుడు ఏఎస్ నాయుడు, అధ్యక్షుడు ఎస్.ధనుంజయనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎంజే సేవియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో పాలక వర్గాల జోక్యాన్ని ఉపాధ్యాయులు అంగీకరించరనే విషయం ఈ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. కొంతమంది ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా మొక్కవోని దీక్షతో ఏపీటీఎఫ్ (1938) కార్యకర్తలు, నాయకులు గాదె గెలుపునకు కృషి చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.

రుషికొండ బీచ్‌లో ఎక్కడికక్కడ సమస్యలు

- ఈ నెలాఖరు నాటికి అన్నీ పరిష్కారం కావాలి
- అధికారులకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం
- బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దుపై కారణాల పరిశీలన



రుషికొండ బీచ్‌లో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

కొమ్మాది: అధికారుల్లో సమన్వయం లోపిస్తే ఎలా అని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అసహనం వ్యక్తం చేశారు. రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దుకు గల కారణాలను పరిశీలించేందుకు ఆయన సోమవారం బీచ్‌లో పర్యటించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. పర్యాటక శాఖ, జీవీఎంసీ, పోలీస్, బ్లూ ఫ్లాగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఈ బీచ్‌లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జేసీ అన్నారు. మరుగుదొడ్లు, దుస్తులు మార్చే గదుల నిర్వహణ అధ్వానంగా ఉండటం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోవడం, బీచ్‌లో కుక్కలు సంచరించడం, తాగునీటి సమస్య, ట్రాఫిక్, వంటి పలు సమస్యలపై ఆయన చర్చించారు. ఈ నెలాఖరు నాటికి బీచ్‌లో ఎటువంటి సమస్య ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సాధారణ రోజుల్లో ఇద్దరిని, సెలవు దినాల్లో నలుగురు పోలీసులను నియమించాలన్నారు. మరుగుదొడ్లు బీచ్‌కు దూరంగా ఉన్నాయని, వాటికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలన్నారు. బీచ్‌లో ఎక్కడా డస్ట్‌బిన్లు కనిపించకపోవడం, పార్కింగ్ స్థలాల్లో లైటింగ్ లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యాటకులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న మెరైన్ టవర్ గురించి అడిగి తెలుసుకున్నారు.

పార్కులో పచ్చదనం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బీచ్ వెంబడి అనధికారికంగా పదుల సంఖ్యలో దుకాణాలు ఉన్నాయని, నిర్వాహకులు ఎక్కడ చెత్త అక్కడే వేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీసీ కెమెరాలు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బీచ్‌లో దొంగతనాలపై దృష్టి పెట్టాలని పోలీసులకు సూచించారు. ప్రస్తుతం పార్కింగ్ వద్ద ఉన్న హెలిప్యాడ్ స్థలాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో అధికారులు ఒక ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుతం వన్‌వే ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, ట్రాఫిక్ నియంత్రణ ఏ విధంగా చేస్తే బాగుంటుందో సూచనలివ్వాలని పోలీసులను కోరారు. బీచ్ నిర్వహణలో ఏ తప్పు జరిగినా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవో సంగీత్ మాథుర్, డిప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాస్, డీఎం జగదీష్, పర్యాటక శాఖ అధికారులు, గరికిన దాసు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో చోరీ కేసు

- హైదరాబాద్‌లో నిందితుడి అరెస్ట్



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

సీతమ్మధార: ద్వారకా స్టేషన్ పరిధి మధురానగర్‌లో జరిగిన భారీ చోరీ కేసులో నిందితుడు పట్టుబడ్డాడు. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ద్వారకా క్రైం పోలీసులు హైదరాబాద్ వెళ్లి.. నిందితుడిని అదుపులోకి తీసుకుని విశాఖకు తీసుకొస్తున్నారు. అతన్ని మంగళవారం అరెస్ట్ చూపిస్తారని సమాచారం. బాధితుడు మరకాని కృష్ణ మధురానగర్‌లోని రాధా మాధవ్ టవర్స్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. అతను బిర్లా జంక్షన్ వద్ద గల లక్ష్మీ మోటార్స్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల ఒకటవ తేదీన ఉదయం తన కుటుంబంతో కలిసి తన అమ్మమ్మ వర్ధంతి కార్యక్రమానికి కాకినాడ వెళ్లారు. 2వ తేదీన పక్క ఇంట్లో ఉన్న శ్రావణి అతనికి ఫోన్ చేసి.. మీ ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉందని తెలియజేశారు. వెంటనే కృష్ణ కాకినాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం తన ఇంటికి చేరుకున్నారు. ఇనుప కప్‌బోర్డు (బీరువా) మంచం మీద పడుకోబెట్టి, తెరిచి ఉండటం గమనించారు. కప్‌బోర్డు తనిఖీ చేసి చూడగా బంగారు చేతి ఉంగరం, బంగారు బ్రాస్‌లెట్, బంగారు గొలుసు, బంగారు హారం లాంగ్, బంగారు పొట్టి హారం, బంగారు చోకర్, బంగారు చెవి రింగులు 2 జతలు, బంగారు ఉంగరాలు–6, బంగారం జిగిని, బంగారం కాసులు–2 మొత్తం కలిసి సుమారు 23 తులాల బంగారు ఆభరణాలు, అలాగే రూ.లక్ష నగదు చోరీకి గురైందని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చుట్టు పక్కల గల సీసీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాత నేరస్తులను విచారించారు. ఈ క్రమంలో ఫిల్మ్‌నగర్‌కు చెందిన వ్యక్తి చోరీ చేసినట్లు గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. క్రైం ఏడీసీపీ మోహనరావు సోమవారం సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. కాగా.. చోరీ జరిగిన రోజు దొంగ చుట్టుపక్కల గల ఇళ్ల గెడలు వేసినట్లు పోలీసులు గుర్తించారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ‘బ్లూఫ్లాగ్’ రద్దు



మాట్లాడుతున్న వెస్లీ

సీతంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2020లో రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభించిందని, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పుడు బ్లూఫ్లాగ్ రద్దయిందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ధ్వజమెత్తారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు ఏటా బ్లూఫ్లాగ్ ధ్రువీకరణకు అవసరమైన 33 ప్రమాణాలను అందుకుంటూ.. గుర్తింపును నిలబెట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. అన్ని రంగాలను విస్మరించినట్టే టూరిజం రంగాన్ని కూడా విస్మరించిందన్నారు. అందువల్లే రుషికొండకు ఉన్న బ్లూఫ్లాగ్ హోదా కోల్పోయిందని విమర్శించారు. సరైన నిర్వహణ లేక పోవడం, పర్యాటకులకు సౌకర్యాలు కల్పించకపోవడం, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరులను రక్షించడంలో ప్రమాణాలు పాటించకపోవడం కారణంగా బ్లూఫ్లాగ్ హోదా రద్దయిందన్నారు. బీచ్‌కి వచ్చే సందర్శకులకు సరైన భద్రత లేకపోవడం, చెత్తను రీసైక్లింగ్ చేయకపోవడం, సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండటం, దివ్యాంగులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం, కుక్కలు సంచరించడం, బీచ్ నిర్వహణ కమిటీలో సమన్వయ లోపం వంటి అనేక వైఫల్యాలను గుర్తించిన డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ గుర్తింపును రద్దు చేసిందన్నారు.

రుషికొండ బీచ్‌కు నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి ఎంతో మంది సందర్శకులు వస్తుంటారని, అటు వంటి బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దు చేయడం విశాఖ ప్రజలకు తీరని అవమానంగా కూటమి ప్రభుత్వం మిగిల్చిందన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు త్వరలోనే తిరిగి బ్లూఫ్లాగ్ గుర్తింపు సాధిస్తామని ఆ పార్టీల నేతలు, అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మేయర్‌ను తప్పించాలని చూస్తే ప్రతిఘటిస్తాం

- యాదవ సంఘాల ప్రతినిధుల హెచ్చరిక



మాట్లాడుతున్న నాయకులు

విశాఖ విద్య: మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని ఆ పదవి నుంచి తప్పించాలని కూటమి పార్టీల నాయకులు చేస్తున్న కుయుక్తులు మానుకోవాలని యాదవ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఎన్ఏడీ కొత్తరోడ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా యాదవ మహాసభ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి అల్లు రమణారావు, జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు యడ్ల వేణుగోపాల కృష్ణ, యాదవ హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.బాజ్జీ, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర మహిళా కార్యదర్శి జె.అనుపమ, శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘ పశ్చిమ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడారు. మేయర్ మార్పుపై జరుగుతున్న ప్రచారాలను తీవ్రంగా మండిపడ్డారు. యాదవ మహిళ అయిన హరి వెంకట కుమారిని.. ఆ పదవి నుంచి తప్పించాలని చూడటం సరైంది కాదన్నారు. ఇలాంటి చర్యలు సరికాదని, యాదవ సంఘాల ఆధ్వర్యంలో తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. మేయర్‌గా హరి వెంకట కుమారి పూర్తి పదవీ కాలం కొనసాగేలా యాదవ సంఘాలన్నీ అండగా నిలుస్తాయన్నారు.



అప్పుడే ఎండ సెగ

వేసవి ఇంకా పూర్తి స్థాయిలో ప్రవేశించకముందే సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో భానుడి తీవ్రతాపం ప్రజలకు సెగలు పుట్టిస్తోంది. మంటలు రేపుతున్న ఎండ నుంచి రక్షించుకోవడానికి ప్రజలు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. చల్లని కళ్లద్దాలు ధరిస్తున్నారు. తలకు టోపీలు పెట్టుకుంటున్నారు. యువతులు ముఖానికి చున్నీలు చుట్టుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత భగభగలాడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు మాత్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ.. వేడి నుంచి తమని తాము కాపాడుకుంటున్నారు. – ఏయూక్యాంపస్

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రిజర్వేషన్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిశుభ్రత, కోచ్‌ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ వంటి విషయాలను ఆయన పరిశీలించారు. ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలు, రిజర్వేషన్ కాంప్లెక్స్, సాధారణ బుకింగ్ కౌంటర్స్, పాదచారుల వంతెనలు, ఎస్కలేటర్స్, లిఫ్ట్స్, ప్లాట్‌ఫాంలు, కేటరింగ్ స్టాళ్లను సందర్శించారు. అనంతరం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య



శివకృష్ణ(ఫైల్)

గోపాలపట్నం: మద్యం కోసం తల్లికి డబ్బులు అడిగితే ఇవ్వలేదని.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఓ యువకుడు ఉరి వేసుకున్నాడు. గోపాలపట్నం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్ నాలుగు కుళాయిల వద్ద గోక శివకృష్ణ(32) తల్లిదండ్రులతో నివాసముంటున్నాడు. తండ్రి, తమ్ముడితో కలిసి ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేస్తుండేవాడు. మద్యానికి బానిస కావడంతో అతని తండ్రి, తమ్ముడు ఈ వ్యాపారం చూసుకుంటున్నారు. కాగా.. శివకృష్ణ సోమవారం ఉదయం పూటుగా మద్యం సేవించాడు. మధ్యాహ్న సమయంలో మద్యం కోసం డబ్బులు కావాలని తల్లి దమయంతిని అడగ్గా.. ఆమె లేవని చెప్పింది. సాయంత్రం భర్త, కొడుకు వచ్చే సరికి టీ పెట్టేందుకని ఆమె పాలు ప్యాకెట్ కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి శివకృష్ణ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించడంతో కేకలు వేసింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు ఆమె భర్త, చిన్న కుమారుడికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత శివకృష్ణను కిందకు దించి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ గొలగాని అప్పారావు నేతృత్వంలో వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5న ఇగ్నో వార్షికోత్సవం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5న 38వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. జైలు రోడ్డు దరి విశాఖ వుమెన్స్ డిగ్రీ కళాశాలలో ఈ వేడుకలు జరగనున్నాయని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వివిధ కోర్సులు పూర్తి చేసిన 1,400 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ముగ్గురికి బంగారు పతకాలు ప్రదానం చేస్తామని ఆయన వెల్లడించారు.

6న ఉమ్మడి విశాఖ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ : ఉమ్మడి విశాఖ జిల్లా సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 6వ తేదీన జరగనున్నట్లు విశాఖ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. బరువు 55 కేజీలు కలిగి 2009 మే 30 తరువాత పుట్టిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్న 34వ రాష్ట్ర సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఏయూ బాస్కెట్‌బాల్ గ్రౌండ్ ఆవరణలో జరగనున్న ఈ ఎంపికలకు క్రీడాకారులు ఆధార్ కార్డు, వయస్సు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.